

కిడ్నీ మార్పిడి పేరుతో మోసం

కిడ్నీ మార్పిడి పేరుతో మోసానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. 8లో▸



పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కేనా?

కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై ఆశలు పెరుగుతున్నాయి. మంత్రాలయం మార్గం, కొత్త రైళ్ల కేటాయింపుపై జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. 8లో▸



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ దక్షిణ నిత్యకళావేదికపై గురువారం సికింద్రాబాద్‌కు చెందిన నూపుర నాట్యాలయ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ భద్రతపై సమీక్ష

కర్నూలు (సెంట్రల్): డీఆర్వో బి.కె.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కలెక్టరేట్ భద్రతపై పోలీసు, అగ్నిమాపక శాఖలతో పాటు వివిధ శాఖల అధికారులు సమీక్ష నిర్వహించారు. విజయవాడకు చెందిన డీఎస్పీ చక్రాధరరావు, కర్నూలు టౌన్ డీఎస్పీ బాబు ప్రసాద్, ఫైర్ ఆఫీసర్లు వై.చిన్నబజారి, బి.ఓబులేసు, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు సురేష్ బాబు, విద్యుత్ శాఖ అధికారి పి.ఓబులేసు, కర్నూలు మూడవ పట్టణ సీఐ శేషయ్య తదితరులు హాజరై కలెక్టరేట్ భద్రతపై సమీక్షించారు. ప్రస్తుతం కలెక్టరేట్ లోపలికి, బయటకు వెళ్లేందుకు నాలుగు గేట్లు ఉన్నాయని, మెయిన్ గేటు, ఫారెస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న గేటులను మాత్రమే వినియోగించాలని, చేనేత భవన్, నగేష్ టీస్టాల్ దగ్గర ఉన్న రెండు గేట్లను మూసివేయించాలని, మెయిన్ గేటు వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండేలా ఔట్‌పోస్టును హెచ్చరించాలని సమీక్షలో అధికారులు అభిప్రాయపడ్డారు. త్వరలోనే కలెక్టరేట్ భద్రతపై పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు డీఆర్వో బి.కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

కేసీకి నీటి విడుదల

కర్నూలు సిటీ: సుంకేసుల బ్యారేజీ నుంచి గురువారం 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. టీబీ డ్యాం నుంచి ఈ ఏడాది బోర్డు అధికారులు నీటి లభ్యత అంచనా మేరకు 9 టీఎంసీ నీటిని కేటాయించారు. ఇందులో నుంచి 2.5 టీఎంసీల నీరు విడుదల చేయాలని జల వనరుల శాఖ కర్నూలు పర్యవేక్షక ఇంజినీర్ నుంచి కర్నూలు ప్రాజెక్టు సీఈ ద్వారా తుంగభద్ర బోర్డుకు ఇటీవల ఇండెంట్ పెట్టారు. ఈ మేరకు తెలంగాణలోని ఆర్డీఎస్ కాలువ వాటాతో కలిపి విడుదల చేస్తున్న నీరు ప్రస్తుతం బ్యారేజీలోకి ప్రవహిస్తోంది. ఈ నీటితో కేసీ ఆయకట్టుతో పాటు, తాగునీటి పథకాలకు అధికారులు విడుదల చేస్తున్నారు.

సారాకు స్వస్తి చెప్పకపోతే పీడీ కేసులు



సారాకు స్వస్తి చెప్పాలని ప్రజలకు వివరిస్తున్న పోలీసులు

కర్నూలు: ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాను మానుకోకపోతే పీడీ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్, ఈఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. కల్లూరు మండలం కొల్లంపల్లి తండా గ్రామంలో గురువారం ఎక్సైజ్ అధికారులు నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సారా వినియోగంతో ప్రజలకు కలిగే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. సారా తయారీ రవాణాకు స్వస్తి చెప్పి ప్రత్యామ్నాయ ఉపాధి ద్వారా గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని తెలియజేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ, ఈబీసీలకు రుణాలు

- ఫిబ్రవరి 7వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోండి

కర్నూలు(అర్బన్): బీసీ కార్పొరేషన్ ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు సామాజిక వర్గాలకు చెందిన వారికి సబ్సిడీ రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జాకీర్‌హుసేన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆయా సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన వారికి సబ్సిడీ రుణాలు అందజేస్తున్నామన్నారు. బీసీ, ఈబీసీ వర్గాలకు చెందిన వారు 21 నుంచి 60 సంవత్సరాల లోపు ఉండాలని, కాపు (కాపు, బలిజ, తెలగ, ఒంటరి) సామాజిక వర్గానికి చెందిన వారు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. వ్యవసాయ సంబంధ కార్యక్రమాలు, పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారం, సేవలు, రవాణా విభాగం తదితర సెక్టార్లకు సంబంధించిన యూనిట్లకు సబ్సిడీ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన వారు https://apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో ఫిబ్రవరి 7వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఈడీ కోరారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

శ్రీశైలంటెంపుల్: ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు శ్రీశైల మహాక్షేత్రంలో 11 రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని ఈఓ ఎం.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. గురువారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అన్ని విభాగాల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగి భక్తుల సౌకర్యాల పట్ల పూర్తి శ్రద్ధ వహించాలన్నారు. మహాశివరాత్రి రోజైన ఫిబ్రవరి 26న ప్రభోత్సవం, పాగాలంకరణ, బ్రహ్మోత్సవ కల్యాణం, మరుసటి రోజు రథోత్సవం, తెప్పోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు.

నయవంచన.. చూసినారా!

ఉద్యోగులకు 'ఆర్థిక' మోసం

- రూ.6,700 కోట్ల బకాయిలు చెల్లిస్తున్నామని ఊరించిన ప్రభుత్వం
- ఉద్యోగులకు ఇచ్చింది రాష్ట్రం మొత్తానికి రూ.1,300 కోట్లే
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగుల పెండింగ్ బకాయిలు రూ.3,000 కోట్లు
- పోలీసులకు ఒక్క సరెండర్ లీవ్ చెల్లింపుతో సరిపుచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పెండింగ్‌లో మూడు డీఏలు
- పీఆర్‌సీ లేదు.. ఐఆర్ ఊసే లేకపోవడంపై సర్వత్రా ఆందోళన



సంక్రాంతి వరాలు రూ.6,700 కోట్లు అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రచారం చేశారు. అయితే ఈ ప్రచారాన్ని నిజం చేయలేదు. రాష్ట్రం మొత్తం మీద ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.25,000 కోట్లు ఉండగా.. ఇచ్చింది రూ.1,300 కోట్లే. పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నీ వస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. 'ఆర్థిక నిర్ణయం' అంటూ చెప్పి మోసం చేశారని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగుల వివరాలు	
కర్నూలు	నంద్యాల
ట్రెజరీ కార్యాలయాలు	
6+1=7	7+1=8
డీడీవోలు	
1,142	1,032
మొత్తం ఉద్యోగులు	
25,895	20,282

పబ్లిక్ సెక్టారు అధికారులు, సిబ్బంది అదనం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,174 మంది డీడీవోలు (డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంటు అధికారులు) ఉండగా.. ట్రెజరీల నుంచి సచివాలయ ఉద్యోగులతో సహా 46,177 మంది వేతనాలు పొందుతున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఉద్యోగులకు వేతనాలు పడటం తప్ప ఇతరత్రా బిల్లులన్నీ ఆర్‌బీఐలో పెండింగ్‌లో ఉండిపోయాయినట్లు తెలుస్తోంది. ప్రతి ఉద్యోగికి ఏదో ఒక బిల్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

కర్నూలు(అగ్రికల్చర్): నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దాదాపు ఎనిమిది నెలలు అవుతోంది. అయితే ఈ కాలంలో ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల గురించి ఆలోచించలేదు. సంక్రాంతి ముంగిట రూ.6,700 కోట్ల పెండింగ్ బకాయిలు ఇస్తున్నట్లు ఊరించి చివరికి ఉసూరు మనిపించారు. ఎన్నికలకు ముందు అన్ని వర్గాలతో పాటు ఉద్యోగులకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరచేతిలో స్వర్గం చూపించారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు తీసుకున్న చర్య ఒక్కటంటే ఒక్కటీ లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ఎక్కడి బిల్లులు అక్కడే!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల బిల్లులు రూ.3,000 పెండింగ్‌లో ఉండిపోయాయి. కర్నూలు జిల్లాలో రూ.1,800 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.1,200 కోట్ల బిల్లులు చెల్లించలేదు. సంక్రాంతి వరాల కింద పోలీసులకు ఒక్క సరెండర్ లీవ్ విడుదల చేశారు. ఉద్యోగులకు ఒకటి, అర ప్రయోజనాలు విడుదల చేయడం మినహా ఎలాంటి చర్యలు లేవు. విశ్రాంత ఉద్యోగులకు పీఆర్‌సీ, డీఏ అరియర్స్ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. రెగ్యులర్ ఉద్యోగులకు పీఆర్‌సీ, డీఏ అరియర్స్‌తో పాటు జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంటు, సరెండర్ లీవ్‌లు తదితర బిల్లులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. గత ఏడాది జూన్ నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు 10 నెలల ఈఈఎల్ సెలవుల వేతనం చెల్లించలేదు. ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిల్లో ఒక్కటి కూడా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో పదవీ విరమణ చేసిన టీచర్ల పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిల్లో ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. సీపీఎస్ ఉద్యోగులకు ఒక్క ప్రయోజనం లభించలేదు.



కర్నూలులో ట్రెజరీ కార్యాలయం

అరకొరగా పోలీసులకు లబ్ధి

ఉద్యోగులకు జీపీఎఫ్ బకాయిలు, పోలీసులకు సరెండర్ లీవు బకాయిలు, ఉద్యోగుల సీపీఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సిన మొత్తం, టీడీఎస్ తదితర వాటి కింద రూ.1,300 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. పోలీసులకు మూడు నాలుగు సరెండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉండగా.. ఒక్కటి మాత్రమే జమ అయ్యింది. ఈ ఒక్కటి తప్ప పోలీసులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఏ ఒక్క ప్రయోజనం లభించలేదు. 2024 ఎన్నికల సమయానికి అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేకుండా ఇచ్చింది. 2023 మార్చి నాటికి జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ చెల్లింపులు పూర్తయ్యాయి. 2023 వరకు సరెండర్ లీవ్‌లు కూడా మంజూరు చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగుల ప్రయోజనాలకు పెద్దపీట వేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ బిల్లుల గురించి పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది.

పీఆర్‌సీ, ఐఆర్ ఊసే లేదు

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పీఆర్‌సీ గురించి పట్టించుకోవడం లేదు. ఐఆర్ ఇస్తుందని ఆశిస్తున్న ఉద్యోగులకు నిరాశే మిగులుతోంది. మంత్రివర్గ సమావేశాలు జరుగుతున్న ప్రతిసారి ఐఆర్ విషయంపై నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నప్పటికీ ఇంతవరకు ఈ దిశగా చర్చే లేకుండా పోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మూడు డీఏలు పెండింగ్‌లో ఉండిపోయాయి. 2024 జనవరి, 2024 జూలై, 2025 జనవరి డీఏలు పెండింగ్‌లో ఉండిపోయాయి. పీఆర్‌సీ, ఐఆర్, పెండింగ్‌లో ఉన్న డీఏలపై ప్రభుత్వాన్ని ఉద్యోగ సంఘాలు ప్రశ్నించడం లేదు. ప్రస్తుత ప్రభుత్వంలో 1వ తేదీన వేతనాలు ఇవ్వడం మినహా ఇతరత్రా ఎలాంటి ప్రయోజనాలు లేవని ఉద్యోగుల్లో ఆందోళన వెల్లువెత్తుతోంది.

ప్రభుత్వంలో చలనం లేదు



ఉపాధ్యాయులకు సంబంధించే వేలాది కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. గత ఏడాది జూన్ నుంచి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుల పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. అయినా ప్రభుత్వంలో చలనం లేదు. బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల్లో అసంతృప్తి పెరిగిపోతోంది. ఉపాధ్యాయులకు సంబంధించి అన్ని రకాల బిల్లులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. సత్వరం న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– రవికుమార్, యూటీఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు

పీఎఫ్ ఇవ్వకపోవడం దారుణం



ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయిలన్నీ విడుదల చేయాల్సిందే. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2024 మే, జూన్ 12వ తేదీ వరకు ఉన్న రెండు బిల్లులకు మాత్రమే అరకొరగా క్రెడిట్ అయ్యాయి. 2024 డిసెంబరు వరకు దరఖాస్తు చేసుకున్న వేలాది మంది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెన్షనర్లకు ఎటువంటి బకాయిలు చెల్లించలేదు. ప్రతి నెలా టీచర్లు, ఉద్యోగుల జీతం నుంచి దాచుకుంటున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఐజీఎస్‌లు కూడా మంజూరు చేయకపోవడం దారుణం.

– హృదయరాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



ఉరుకుంద క్షేత్రం ఏరియల్ వ్యూ

ఈరన్న వైభవం శిఖర శోభితం

- రేపటి నుంచి ఉరుకుందలో తొలి మహాకుంభాభిషేక మహోత్సవాలు
- 3న రాజగోపురాలపై కలశ ప్రతిష్టాపన, కుంభాభిషేకం
- ప్రత్యేక హెలికాప్టర్‌తో పుష్పవృష్టి

మంత్రాలయం/కౌతాళం: ఉరుకుంద క్షేత్రం మహా కుంభాభిషేక మహోత్సవానికి సన్నద్ధమైంది. సప్తనదుల పుణ్యజలాలతో పునీతం కానుంది. రూపుదిద్దుకున్న రాజగోపురాలు, శిఖరాగ్రాన కలశ ప్రతిష్టలు, ఆదిపూజ్యుడు గణపతి, లక్ష్మీదేవి, నూతన ధ్వజం, నవగ్రహ మండప ప్రతిష్టలతో భక్తకోటికి కనువిందు చేయనుంది. ప్రత్యేక హెలికాప్టర్‌తో పుష్పవృష్టి, కుంభాభిషేకం ఘట్టం ఆలయ చరిత్రలో లిఖితపూర్వం కానుంది. కౌతాళం మండలంలోని ఉరుకుంద గ్రామానికి తూర్పు దిక్కున 500 ఏళ్ల క్రితం త్రిమూర్తుల నిలయం అశ్వత్థ వృక్షం (రావిచెట్టు) ఉండేది. లక్ష్మీనరసింహస్వామి అశ్వత్థ వృక్షాన్ని సిద్ధయోగి ఈరన్న స్వామి కొలిచారు. స్వామి సేవలో తరిస్తూ.. సత్య ధర్మాలను పాటిస్తూ ఈరన్న స్వామి ఐక్యమైనట్లు చరిత్ర. నేటికీ సిద్ధయోగి అగ్ని ఆకారంలో క్షేత్రంలో సంచరిస్తున్నట్లు భక్తుల ప్రగాఢ విశ్వాసం.

కుంభాభిషేకం విశిష్టత

రాజగోపురాలపై కలశాలను ప్రతిష్ట, పునః ప్రతిష్టాపన సందర్భంగా మంత్రజలంతో అభిషేకించి క్షేత్రం దివ్యశక్తిని ఇనుమడింపజేసే పవిత్ర కార్యాన్ని కుంభాభిషేకం మహోత్సవంగా వర్ణిస్తారు. కుంభాభిషేకంతో క్షేత్రం నలుదిశలా పవిత్రత భక్తులకు ఆశీర్వచనంగా మారడం. ఈరన్న స్వామి భక్తుల దాతృత్వ పరిమళాలతో ఆలయ నాలుగు దిక్కుల్లో నాలుగు రాజగోపురాలు నిర్మితమయ్యాయి. స్థపతి పరమేశ్వరప్ప సలహాతో శాస్త్రోక్తంగా నాలుగుగోపురాలను శిలతో మొదటి అంతస్తును రూపొందించి తక్కిన అంతస్తులను ఇటుకతో నిర్మించారు. దాదాపు రూ.8.60 కోట్లతో రాజగోపురాలు కట్టించారు. ప్రధాన తూర్పు గోపురాన్ని ఏడు అంతస్తులతో నిర్మించగా మిగిలిన పడమర, ఉత్తర, దక్షిణ రాజగోపురాలను ఐదు అంతస్తులతో పూర్తి చేశారు. భక్తుల సహకారంతో ఇప్పటికే గోపురాలకు రంగులద్ది చూడ ముచ్చటగా తీర్చిదిద్దారు. కుంభాభిషేకంలో భాగంగా కలశాలను సప్తనదుల పవిత్ర జలంతో అభిషేకించనున్నారు. గంగా, గోదావరి, సింధు, కృష్ణ, యమున, కావేరి, సరస్వతి నదుల నుంచి ఇప్పటికే జలాలను తీసుకువచ్చారు. శైవాగమ శాస్త్రం ప్రకారం పవిత్ర జలాలను మంత్రపూరితం చేసి అభిషేకం చేయనున్నారు.



ప్రతిష్ఠించనున్న కలశాలు

రూ. 84 లక్షలతో బంగారు పూత కలశాలు

కొత్తగా నిర్మించిన గోపురాలతోపాటు పాత గోపురంపై కూడా కొత్తగా కలశాలను ప్రతిష్ఠించనున్నారు. ప్రధాన తూర్పు రాజగోపురంపై ఏడు, మిగిలిన 4 రాజగోపురాలపై ఐదేసి చొప్పున నూతన కలశాలను ఏర్పాటు చేస్తారు. భక్తుల సహకారంతో రూ.84 లక్షలతో 27 బంగారు పూతతో కలశాలను రూపొందించారు. అందులో ప్రధాన రాజగోపురం టేకు తలుపులతోపాటు కలశాలను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేయనున్నారు. రూ.22 లక్షలతో కలశాలను తయారు చేయించారు.



ఆలయ ముఖద్వారం



పూజోత్సవాలు

మూడు రోజుల పాటు కుంభాభిషేక వేడుకలు జరగనున్నాయి. కాకినాడకు చెందిన శైవాగమ ప్రవీణులు సుబ్రహ్మణ్య దీక్షితుల నేతృత్వంలో 60 వేదపండితులతో పూజోత్సవాలు జరగనున్నాయి.

- 1వ తేదీ శనివారం మంగళవాయిద్యాల స్వస్తితో యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, త్రిశూల పూజ ఉంటుంది. సాయంత్రం ప్రధాన కలశారాధన, మూల మంత్ర హోమాలు ఉంటాయి.
- ఆదివారం గణపతి పూజ, వాస్తుపూజ, వాస్తు హోమం, వాస్తు బలి, క్షీరాభిషేకం, గ్రామోత్సవం, శాలాంగ దేవతా హోమాలు ఉంటాయి.
- సోమవారం పీఠపూజ, యంత్ర, విగ్రహ కలశ, ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన ఉంటాయి. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులతో ముహూర్తం పెట్టనున్నారు. ఉదయం 11 గంటలకు జీవన్యాసం, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, కుంభ నిక్షేపణ ఉంటాయి.

ప్రత్యేక ఏర్పాట్లు



క్షేత్రంలో తొలిసారిగా కుంభాభిషేకం మహోత్సవం చేపట్టాం. శాస్త్రోక్తంగా శుభ కార్యాన్ని జరిపేందుకు ప్రత్యేక ఏర్పాట్లు సైతం చేశాం. వేద పండితులతో హోమాలు జరగనున్నాయి. భక్తుల కోసం 170 వసతి గదులు ఉన్నాయి. వేడుక తిలకించేందుకు, సేద తీరేందుకు రూ.50 లక్షలతో షెడ్లు ఏర్పాటు చేశాం. హోమాల కోసం ప్రత్యేకంగా పచ్చతోరణాలతో మంటపాన్ని రూపొందించాం. కలశ ప్రతిష్ఠ కోసం మెట్ల అమరికతోపాటు హైమ్యాక్స్ లైట్లు ఏర్పాటు చేశాం. మహోత్సవానికి 2 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఆలయం చుట్టూర వ్యాపార దుకాణాలను తొలగించాం. – మేడిపల్లి జయరాజు, ఆలయ ఈఓ, డిప్యూటీ కమిషనర్

భక్తులు సంతృప్తిపడేలా సేవలందించండి

- పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి

శ్రీశైలంటెంపుల్: భక్తులు సంతృప్తిపడేలా సేవలందించాలని పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం శ్రీశైలంలో ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నడుపబడుతున్న రోప్‌వే, బోటింగ్‌లను పరిశీలించారు. స్వయంగా రోప్‌వేలో ప్రయాణించి పాతాళగంగకు చేరుకున్నారు. జాయి బోటింగ్‌లో ప్రయాణించారు. అనంతరం అధికారులతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం హరిత రిసార్ట్‌కు చేరుకుని వసతి గదులు, హోటల్‌ను పరిశీలించారు. ఆమె వెంట శ్రీశైలం టూరిజం రోప్‌వే మేనేజర్ పెంచలరెడ్డి, హరిత రిసార్ట్ మేనేజర్ పవన్ ఉన్నారు.



పాతాళగంగ వద్ద బోట్‌లో ప్రయాణిస్తున్న పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి

ముగిసిన పత్తి కొనుగోళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పత్తి కొనుగోళ్లను సీసీఐ ముగించింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జిల్లాలోని ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు, మంత్రాలయంలో మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు చేపట్టింది. జిల్లా మొత్తంగా 17,168 మంది రైతుల నుంచి పత్తిని సీసీఐ కొనుగోలు చేసిందని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.297.91 కోట్ల విలువ కలిగిన 4.04 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశామన్నారు. రైతులు ఇంకా రూ.2.50 కోట్ల వరకు పేమెంటు చేయడం పెండింగ్‌లో ఉందన్నారు.

'మైక్రో' వేధింపులు

ఆలూరు: కంతు కట్టలేదని ఇంటి యజమానిని బయటకు రానివ్వకుండా మైక్రోఫైనాన్స్ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ ఘటన ఆలూరులో గురువారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండకు చెందిన స్పందన మైక్రోఫైనాన్స్ (సూక్ష్మరుణాన్ని)నుంచి గత ఐదు నెలల క్రితం రూ. 55,000 నగదును ఆలూరు కోయినగర్ కాలనీలో నివాసం ఉంటున్న భార్యాభర్తలు శివ, సరోజ తీసుకున్నారు. తీసుకున్న అప్పు మొత్తానికి ప్రతి నెలా రూ. 2,500 ప్రకారంగా వడ్డీని చెల్లించాలని ఆధార్, ఓటరు కార్డులను తీసుకున్నారు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో వడ్డీ చెల్లించలేకపోతున్నామని కొంత సమయం ఇవ్వాలని వారు ఫైనాన్స్ సిబ్బందిని అడిగినా ఫలితం లేకుండా పోయింది. ఫైనాన్స్ సిబ్బంది ఇంట్లోకి వచ్చి వేధింపులకు గురిచేస్తున్నారని కాలనీవాసులు ఆలూరు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారాన్ని చేరవేశారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ జీ. దిలీప్‌కుమార్ తెలిపారు.



ఇంటి ఆవరణలో మైక్రోఫైనాన్స్ సిబ్బంది

కరువుపై అధ్యయనం

పెద్దకడబూరు: కరువు ప్రభావిత ప్రాంతాలపై అధ్యయనం చేస్తున్నట్లు ఐఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్‌బాబు తెలిపారు. మండల ఏఓ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ కర్నూలు) ప్రొఫెసర్ డాక్టర్ నరేష్‌బాబు, ఆయన బృందం మండల పరిధిలోని పీకలబెట్ట, గవిగట్టు గ్రామాలలో కరువు ప్రభావిత ప్రాంతాలను గురువారం సందర్శించారు. కరువు కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వారి సౌజన్యంతో అనంతపురం, కర్నూలు జిల్లాలలోని కరువు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిశోధనలు చేస్తామన్నారు. సాధారణ పంట పొలాలను, కరువు ప్రభావిత పొలాల ఫొటోలను సేకరించి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) ద్వారా వర్గీకరించడానికి అభివృద్ధి చేయబోతున్నామన్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చెందిన తరువాత కరువు ద్వారా నష్టపోయిన పంటలను గుర్తించడం సులభతరం అవుతుందన్నారు.



పీకలబెట్టలో పొలాలను డ్రోన్‌తో చిత్రీకరిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

15 క్వింటాళ్ల సీడ్ పత్తి పంట దగ్ధం



కాలిన పత్తి దిగుబడులు పరిశీలిస్తున్న అధికారులు

దొర్నిపాడు: చేసిన కష్టం అగ్నికి ఆహుతి అయ్యింది. ఫలితంగా రూ.లక్షల్లో నష్టం రావడంతో పత్తి రైతు బోరున విలపిస్తున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కళావంతుల బాబు ఎకరా రూ.42 వేలు కౌలు చెల్లించి మూడెకరాల్లో సీడ్ పత్తి సాగు చేశాడు. మూడు విడతలుగా వచ్చిన 15 క్వింటాళ్ల పత్తిని ఇంటిపైన ఆరబెట్టాడు. కోతులు విద్యుత్ తీగలపై వేలాడంతో నిప్పులు చెలరేగి పత్తిపై పడ్డాయి. ఇంటిపైన మంటలు వ్యాపించడం గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే ఆళ్లగడ్డ అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈలోగా దాదాపు రూ.6 లక్షల విలువ చేసే పత్తి కాలిపోయిందని రైతు బోరున విలపించాడు. తహసీల్దార్ సుభద్ర, ఏఓ ప్రమీల, ఏఎస్ఐ రంగయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వెబ్‌సైట్‌లో ఎఫ్ఎన్ఓ మెరిట్ జాబితా

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయబోయే ఎఫ్ఎన్ఓ పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాను https:// kurnool.ap.gov.in, https://nandyal.ap. gov. in అనే వెబ్‌సైట్లలో ఉంచినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31 నుంచి 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రాతపూర్వకంగా తెలపాలన్నారు.

శ్రీశైలంలో 88 టీఎంసీల నీటి నిల్వలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో గురువారం సాయంత్రానికి 87.8605 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 853.40 అడుగులకు చేరుకుంది. బుధవారం నుంచి గురువారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు 14,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 4.385 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఉత్పాదన అనంతరం 8,400 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 2,500, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,600, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా జలాశయంలోకి 5,677 క్యూసెక్కుల నీటిని మళ్లించారు.

రుణాల పేరుతో మోసం

- ఇద్దరు అరెస్టు

కర్నూలు(అగ్రికల్చర్): దళిత శక్తి ఫౌండేషన్ పేరుతో కేంద్ర పథకాల ద్వారా వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇప్పిస్తామని నమ్మించి భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను కర్నూలు టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లె అపూర్వ అక్షరధామంకు చెందిన మాసిపోగు మారెన్న, అదే ప్రాంతానికి చెందిన మహే జబీన్ అనే వ్యక్తులు దళిత శక్తి ఫౌండేషన్ ఏర్పాటు చేసి అనేక మందికి రుణాలు ఇప్పిస్తామని చెప్పి నమ్మించి రూ.29.70 లక్షలు వసూలు చేసుకుని పరారయ్యారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతో విచారణ చేపట్టారు. కర్నూలు టూటౌన్ సీఐ నాగరాజరావు ఆధ్వర్యంలో పోలీసులు నిందితులను గురువారం రాత్రి అరెస్టు చేసి వీరిని కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కేనా?

- రేపు పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్
- మంత్రాలయం – కర్నూలు రైల్వే లైనుకు మోక్షం లభించేనా?
- సర్వే దశలో పారిశ్రామిక రైలు ప్రాజెక్టు
- కర్నూలు– అమరావతి ఇంటర్‌సిటీ రైలు మళ్లీ వచ్చేనా?
- ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పైనే కోటి ఆశలు



కర్నూలు(సెంట్రల్): రెండు రోజుల్లో కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టనుండటంతో జిల్లా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సారైనా కలల రైల్వే ప్రాజెక్టులు పట్టాలెక్కేనా.. అని చర్చించుకుంటున్నారు. రాష్ట్ర తొలి రాజధాని, రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు జిల్లా రైల్వే ప్రాజెక్టుల విషయంలో ప్రతిసారి అన్యాయం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు రైల్వే శాఖ, బోర్డుకు విన్నపాలు చేస్తున్నా ఫలితం లేకపోవడంతో రైల్వే ప్రాజెక్టుల పురోగతికి పట్టిన గ్రహణం వీడడం లేదు. 2025–26 సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనైనా జిల్లాకు సంబంధించి కర్నూలు–మంత్రాలయం కొత్త లైన్, కర్నూలు నుంచి అమరావతికి నేరుగా రైలు, రిహాబిలిటేషన్ వర్క్‌షాపు పూర్తి కోసం నిధులు కేటాయించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ క్రమంలో శనివారం పార్లమెంట్‌లో ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌పై అందరి దృష్టి పడింది. ఆయా ప్రాజెక్టులు పట్టాలు ఎక్కాలంటే దాదాపు రూ.2 వేల కోట్ల నిధులు అవసరం అవుతాయి. కేంద్రం, రాష్ట్రంలో కూటమి సర్కారే అధికారంలో ఉండడంతో నిధుల కేటాయింపులకు అవకాశం ఉందని ప్రజలు ఆశగా ఉన్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీ డోన్ నుంచి మహబూబ్‌నగర్ వరకు రైల్వే డబ్లింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఇటీవల విశాఖ వచ్చిన సందర్భంగా వర్చువల్‌గా ప్రారంభించారు. మొదటి దశంలో బోగోలు నుంచి దూపాడు వరకు డబ్లింగ్ పనులు చేపడతారు. అయితే ఇందుకోసం బడ్జెట్‌లో కేటాయింపులు ఎలా ఉంటాయనేది బడ్జెట్‌పై ఆధారపడి ఉంటుంది. దాదాపు రూ.5 వేల కోట్ల నిధులు అవసరం ఉంటుంది.

48 ఏళ్ల క్రితం ప్రతిపాదన..

మంత్రాలయం – కర్నూలు వరకు నిర్మించాల్సిన కొత్త రైల్వే లైను పనులకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. జిల్లా కేంద్రమైన కర్నూలును ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయానికి రైలు మార్గం నిర్మించాలని 48 ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. అయినా ఇప్పటికీ వరకు మోక్షం లభించ లేదు. రెండు సార్లు సర్వే చేసి, నిధులు వృథా చేశారు కానీ మార్గం చూపలేదు. 2004లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.166 కోట్లతో రైల్వే లైను నిర్మించేందుకు అంగీకరించి, సర్వే పనుల కోసం రూ.9.43 లక్షలు కేటాయించారు. 2011 డిసెంబర్‌లో రీ సర్వే, 2018–19 బడ్జెట్‌లో మళ్లీ మూడో సర్వే చేయాలని చేశారు. మూడు సర్వేలు అదే మార్గాన్ని సూచించినా లైను మాత్రం మంజూరు కాలేదు. 110 కిలో మీటర్లకు పొడవైన ఈ రైలు మార్గానికి 2004లో రూ.166 కోట్లు అవుతుందని అంచనా వేయగా దీని విలువ 2019 నాటికి రూ.1,430 కోట్లకు చేరింది. ఈ మార్గం పూర్తయితే కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు రవాణా వ్యవస్థ మెరుగుపడి పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

నిధుల లేమి..

కర్నూలు సమీపంలోని పంచలింగాలలో రైల్వే మిడ్ లైఫ్ రిహాబిలిటేషన్ వర్క్‌షాపు ఏర్పాటుకు 2013 బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 100 ఎకరాల్లో స్థల సేకరణ చేసి పనులు చేపట్టారు. నిధుల కొరత కారణంగా 11 ఏళ్లు గడిచినా పనులు మాత్రం పూర్తి కాలేదు. అరకొర నిధులతో ముందుకు సాగుతున్న ఈ ప్రాజెక్టు దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పటికీ మరో 70–80 కోట్ల నిధులు కావాల్సి ఉంది.

మెయింటెనెన్స్ షెడ్ ఏదీ?

నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు 2013లో తెరపైకి వచ్చిన ట్రిన్ మెయింటెన్స్ (నిర్వాహణ) షెడ్ అచూకీ లేకుండా పోయింది. దూపాడు వద్ద దీనిని ఏర్పాటు చేస్తామని గత రైల్వే సహాయ మాజీ మంత్రి కోట్ల చెప్పారు. దీనికి రూ.200 కోట్లు కావాల్సి ఉంది. ఈ వర్క్‌షాపు నిర్మిస్తే దాదాపు 5వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

పారిశ్రామిక రైలు కూత లేనట్లే..

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఓర్వకల్‌ను కలుపుతూ 2023లో కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక రైలు లైన్‌ను ప్రతిపాదించింది. దూపాడు–ఓర్వకల్–బేతంచెర్ల వరకు దాదాపు 50 కిలోమీటర్ల మేర రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త రైల్వే లైన్‌కు సర్వే చేయాలని ఆర్వీ అసోసియేట్ అనే కన్సల్టెంట్‌కు అప్పగించింది. ఆ సంస్థ సర్వే చేసి డీపీఆర్‌ను రూపొందించాల్సి ఉంది. అయితే సర్వే పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో డీపీఆర్ సిద్ధం కాలేదు. ఈ క్రమంలో ఈ కొత్త మార్గం పనులకు మరో బడ్జెట్ వరకు నిధుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది.

రాజధానికి వెళ్లేదెట్టా?

ప్రస్తుత రాజధాని అమరావతి (విజయవాడ)కి వెళ్లి వచ్చేందుకు కర్నూలు నుంచి నేరుగా రోజువారి రైళ్లు లేవు. గతంలో ప్రత్యేక చార్జీలతో వారంలో మూడుసార్లు నడుస్తున్న మచిలీపట్నం స్పెషల్ రైలును కూడా రద్దు చేశారు. దీంతో అమరావతి వెళ్లాలంటే డోన్, నంద్యాలకు వెళ్లి రైలెక్కాలి. కర్నూలు నుంచి రోజువారిగా ఇంటర్ సిటీ, మరో రెండు ప్యాసింజరు రైళ్లను రోజువారిగా నడపాల్సిన అవసరం ఉంది. కాగా, అమరావతికి కర్నూలు నుంచి నేరుగా రైలును నడపాలని జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్ ఆరునెలల క్రితం రైల్వే మంత్రికి విన్నవించారు. కేంద్రంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉండడంతో కర్నూలు–అమరావతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే కర్నూలు – నంద్యాల మధ్య కొత్త లైను ఏర్పాటు చేస్తే ఉమ్మడి కర్నూలు జిలా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.


ఏటా జిల్లాకు అన్యాయం జరుగుతోంది



కర్నూలు జిల్లా రైల్వేప్రాజెక్టులపై ఆర్థిక శాఖ మంత్రి పక్షపాతం చూపుతున్నారు. దాదాపు ఆమె 8 ఏళ్ల నుంచి బడ్జెట్ ప్రవేశపెడుతున్నా జిల్లాకు ఒక్క మేలు చేయడం లేదు. రిహాబిలిటేషన్ వర్కుషాపును పూర్తి చేసేందుకు పూర్తి స్థాయిలో బడ్జెట్‌ను కేటాయించాలి. కర్నూలు నుంచి విజయవాడకు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను నడపాలి. మంత్రాలయం–కర్నూలు రైల్వే పనులడీపీఆర్‌ను ఆమోదించి నిధులు కేటాయించాలి.

– వై.నగేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కర్నూలు

పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలి



రాష్ట్రం, కేంద్రంలో కూటమి సర్కార్లే ఉన్నాయి. ఈ సమయంలో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోతే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు విలువ ఉండదు. కర్నూలు నుంచి అమరావతికి రైలును నడపాలి. మంత్రాలయం రైల్వే లైన్‌కు నిధులు కేటాయించాలి. ఓర్వకల్‌ను అభివృద్ధి చేసేందుకు రైల్వే లైన్‌ను వేయాలి. గతంలో కేంద్రంలోని బీజేపీ సర్కార్ అన్యాయం చేసింది. ఈసారైనా న్యాయం జరగాలి.

– ఎస్వీమోహన్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును విరమించుకోవాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న బ్రిజేష్ సింగ్

కర్నూలు (సెంట్రల్): నిర్మాణ, స్థిరాస్తి రంగాలు సంక్షోభంలో ఉన్న సమయంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. గురువారం నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యుడు ఇ.పుల్లారెడ్డి అధ్యక్షతన రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యాపార, వాణిజ్య రంగాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు హాజరయ్యారు. బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిరాం రెడ్డి, బ్రిజేష్ సింగ్, ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాహుల్, రైస్‌మిల్ అసోసియేషన్ నాయకులు బ్రహ్మయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ సమయంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచడం తప్పు అన్నారు. భూములు, ఇళ్లు, ఇతర స్థిరాస్తులకు సంబంధించిన విలువలను పెంచడంతో రియల్ ఎస్టేట్ రంగం కోలుకోలేకుండా పోతుందన్నారు. సీనియర్ జర్నలిస్టు గోరంట్లప్ప, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి జాకీర్ బాషా, రిటైర్డ్ ఎస్ఐ మొహిద్దీన్, మహేశ్వరరావు, చంద్రమౌళి, నాగరాజు, మహమ్మద్ యూనుస్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు మంచినీరు

- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

హాలహర్వి: అన్ని గ్రామాలకు సక్రమంగా మంచినీరు సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. బాపురం రిజర్వాయర్‌ను గురువారం ఆయన పరిశీలించారు. సిద్దాపురం, అమృతాపురం, బల్లూరు గ్రామాలకు నీరు సరిగ్గా అందడంలేదని తన దృష్టికి వచ్చిందని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిల్టర్‌బెడ్‌లో నీరు సక్రమంగా లేకపోవడంతో ఫిల్టర్‌బెడ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీఈ మల్లికార్జునను ఆదేశించారు. అనంతరం గూళ్యం గ్రామంలోని సచివాలయం –1ను తనిఖీ చేశారు. డీఎల్‌డీఓ అనురాధ, ఏఈ వెంకటరమణమ్మ, డీఈ మల్లికార్జున, ఎంపీడీఓ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తనీయొద్దు

ఆస్పరి: వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో ప్రజలకు నీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ గీతావాణికి జెడ్పీ సీఈఓ నాసర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆస్పరి మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. మండలంలోని సచివాలయాల పని తీరు గురించి ఎంపీడీఓను అడిగి తెలుసుకున్నారు.

బావిలో మృతదేహం లభ్యం

గోస్పాడు: శిరివెళ్ల మండలం చెన్నూరు గ్రామానికి చెందిన ఉసేని(48) మృతదేహం దీబగుంట్ల – సాంబవరం గ్రామాల మధ్య రహదారి పక్కన ఉన్న బావిలో లభ్యమైంది. ఎస్ఐ వెంకట ప్రసాద్ తెలిపిన వివరాలు.. ఉసేని బైకు మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆస్పత్రులకు వెళ్లాలని కుటుంబ సభ్యులు చెప్పినా వినకుండా భూత వైద్యులను సంప్రదించేవాడు. అప్పుడప్పుడూ ఇంటి నుంచి ఎప్పుడు పడితే అప్పుడు వెళ్లిపోయి తిరిగి వస్తుండేవాడు. ఈనెల 28న ఇంటి నుంచి వెళ్లి పోవడంతో ఎప్పటిలాగే తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. కానీ దీబగుంట్ల – సాంబవరం గ్రామాల మధ్య బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా బావిలో ఎలా పడ్డాడనే వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

కిడ్నీ మార్పిడి పేరుతో మోసం

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



కిడ్నీ మార్పిడి పేరుతో మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కిడ్నీ మార్పి పేరుతో మోసానికి పాల్పడిన గూడూరు మండలం పొన్నకల్లు గ్రామానికి చెందిన బోయ నరసింహుడును మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. గురువారం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన మండ్ల రమేష్ తండ్రి నాగప్ప మూడేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధ పడుతుండేవాడు. తరచూ డయాలసిస్ చేయించుకునే క్రమంలో నిందితుడు బోయ నరసింహుడు తనకు తానుగా రమేష్‌తో పరిచయం చేసుకుని 'కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తున్నానని, పెద్దపెద్ద డాక్టర్లు తన మాట వింటారని, తాను కిడ్నీ మార్పిడి చేయిస్తాను అని నమ్మబలికాడు. ఈ మేరకు 2023 నవంబర్ 19వ తేదీన రూ.3.15 లక్షలు తీసుకున్నాడు. అప్పటి నుంచి కనిపించకుండా తప్పించుకు తిరుగుతుండటంతో ఈనెల 27వ తేదీ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పక్కా ఆధారాలతో కోట్ల కిసాన్ ఘాట్ దగ్గర స్విమ్మింగ్ పూల్ సమీపంలో నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.లక్ష రికవరీ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. అవయవ దానం విషయంలో ప్రత్యేక నిబంధనలు ఉంటాయని, మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని డీఎస్పీ ప్రజలకు సూచించారు. అవయవ దానం విషయంలో వ్యాపారాలు చేయడం నేరం ప్రతి ఒక్కరూ చట్ట పరిధిలో వ్యవహరించాలని సూచించారు. సీఐ శేషయ్య, ఎస్ఐ మన్మథ విజయ్ తదితరులు కూడా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

3న ఉద్యోగ మేళా

నంద్యాల(న్యూటౌన్): వచ్చే నెల 3న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ డిప్లమా, బీటెక్, ఎనీ ట్రేడ్‌లు పూర్తిచేసిన 18 నుంచి 27 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగ మేళాకు అర్హులన్నారు. కియా కంపెనీలో యాజమాన్యం హాజరై ఇంటర్వ్యూల ద్వారా తమకు కావాల్సిన వారిని ఎంపిక చేసుకుంటుందన్నారు. విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో రావాలని సూచించారు. మర్ని వివరాలకు 9182217075 నంబరును సంప్రదించాలన్నారు.

డీసీసీబీ ఓల్డ్ టౌన్ బ్రాంచ్ మేనేజర్‌పై వేటు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఓల్డ్ టౌన్ బ్రాంచ్ మేనేజర్ యూనిటీపై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెన్షన్ వేటు పడటం ఇది రెండవ సారి. డీసీసీబీ 2024–25లో కొన్ని విధానపరమైన నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా కర్షకజ్యోతి అనే రుణ పథకాన్ని ఈ ఏడాది నిలుపుదల చేసింది. దీనిని విమర్శిస్తూ... ఆరిపోయిన కర్షకజ్యోతి అంటూ డీసీసీబీ అధికారుల గ్రూపులతో పాటు ఇతర గ్రూపుల్లో పోస్టు చేసినట్లు తెలుస్తోంది. బ్యాంకు పాలసీని విమర్శించడంతో ఆగ్రహించిన జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈవో విజయకుమార్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. అయితే ఈ నోటీసుకు మేనేజర్ స్పందించలేదు. దీంతో మేనేజర్‌పై చార్జెస్ ఫ్రైమ్(అభియోగాలు నమోదు) చేశారు. అయినప్పటికీ మేనేజర్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సస్పెండ్ చేస్తూ సీఇవో విజయకుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పత్తికొండ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేస్తున్నపుడు తనిఖీలకు వెళ్లిన ఆప్కాబ్ అధికారుల పట్ల కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆ సమయంలో కూడా సస్పెండ్ వేటు పడింది. తాజాగా బ్యాంకు నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వ్యంగ్యంగా పోస్టులు పెట్టడాన్ని జిల్లా సహకార కేంద్రబ్యాంకు తీవ్రంగా పరిగణించి వేటు వేసినట్లు తెలుస్తోంది.

కిడ్నీ ఇప్పిస్తానని రూ.3 లక్షలు వసూలు

- అనెస్తీషియా టెక్నీషియన్‌పై సోషల్ మీడియాలో వైరల్

కర్నూలు(హాస్పిటల్): కిడ్నీ ఇప్పిస్తానని ఓ వ్యక్తి వద్ద రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశాడని అనెస్తీషియా టెక్నీషియన్‌పై వస్తున్న ఆరోపణలు సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా వైరల్‌గా మారాయి. గూడూరు మండలానికి చెందిన అనెస్తీషియా టెక్నీషియన్ గత యేడాది కర్నూలు పెద్దాస్పత్రిలో కోర్సు పూర్తి చేసినట్లు సమాచారం. ఇతను ఆసుపత్రికి వచ్చే రోగులకు మాయమాటలు చెప్పి డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఇదే క్రమంలో ఓ వ్యక్తి తన తండ్రికి కిడ్నీ ఇప్పిస్తానని చెప్పి రూ.3 లక్షలు తీసుకుని మోసం చేశాడని, తిరిగి డబ్బులు అడిగితే ఇవ్వడం లేదని బాధితుడు ఓ వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇతని గురించి పోలీసులకు, వైద్యులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అందులో తెలిపాడు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు వివరణ కోరగా ఇతను గత యేడాది అనెస్తీషియా టెక్నీషియన్ పూర్తి చేశాడని తెలిసిందని, ప్రస్తుతం ఆసుపత్రిలో పనిచేయడం లేదని తెలిపారు. అతని గురించి ఏ ఒక్కరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

అతివేగం అత్యంత ప్రమాదకరం

- మోటర్ వాహనాల తనిఖీ అధికారి సుధాకర్‌రెడ్డి



వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కర్నూలు: వాహనాలను అతివేగంగా నడపడం అత్యంత ప్రమాదకరమని మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఎంవీ సుధాకర్‌రెడ్డి అన్నారు. డ్రైవర్లు దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి కంటి, ఇతర వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. బి.తాండ్రపాడు గ్రామ శివారులోని రవాణా శాఖ కార్యాలయంలో 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఆర్‌టీఓ భరత్ చావన్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐలు సుధాకర్‌రెడ్డి, ఎస్.నాగరాజు నాయక్ తదితరులు మాట్లాడారు. ఫిబ్రవరి 15 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ కార్యాలయ పని నిమిత్తం వచ్చేవారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండి, మోటార్ సైకిల్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు లైసెన్స్ కలిగి ఉండి తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. వాహనదారులు, డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం ఎంతో ప్రమాదకరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ బుక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకుని వాహనాలు నడపాలని సూచించారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. అనంతరం డ్రైవర్లు, వాహనదారులతో రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు వి.బాబు కిషోర్, ఎస్.గణేష్ బాబు, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ విజయభాస్కర్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

అప్పు తీర్చమన్నందుకు వ్యక్తిపై దాడి

ఉయ్యాలవాడ: మండలంలోని కొండుపల్లె గ్రామంలో ఇచ్చిన అప్పును తిరిగి ఇవ్వమని అడిగినందుకు దాడి చేసిన ఘటన గురువారం చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. కొండుపల్లె గ్రామానికి చెందిన పాములేటి సీడుపత్తి సాగు చేసుకోగా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన నరేష్ తన ఆటోలో ప్రతి రోజు వ్యవసాయ కూలీలను తీసుకుని వచ్చేవాడు. ఇందులో భాగంగా పాములేటి నరేష్‌కు రూ.18 వేలు బకాయి పడ్డాడు. బకాయి డబ్బులు ఇవ్వమని పాములేటిని నరేష్ అడిగే క్రమంలో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన పాములేటి కర్రతో నరేష్ తలపై కొట్టడంతో గాయాలపాలయ్యాడు. ఉయ్యాలవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు నరేష్‌ను నంద్యాలకు తీసుకెళ్లారు. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

భూకబ్జాకు యత్నించిన ఐదుగురిపై కేసు నమోదు

బొమ్మలసత్రం: తప్పుడు పత్రాలతో 10 సెంట్ల స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించిన న్యాయవాదితోపాటు మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. త్రీటౌన్ సీఐ కంబగిరిరాముడు తెలిపిన వివరాలు.. నంద్యాలలోని బర్మశాల వీధిలో 10 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి 16 ఏళ్ల నుంచి ప్రభాకర్ తన కుటుంబ సభ్యులతో ఓ ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నాడు. బుధవారం పట్టణానికి చెందిన న్యాయవాది లింగమయ్య, సయ్యద్‌అలీ, బత్తుల కిషోర్, బుర్ర నరసింహులు, అన్నపురెడ్డి శామ్సన్ తప్పుడు ధ్రువపత్రాలతో స్థలం వద్దకు చేరుకున్నారు. స్థలంలో నివాసముంటున్న ప్రభాకర్ కుటుంబ సభ్యులు అడ్డురాగా వారిపై దుర్భాషలాడి స్థలంలోని ఇంటిని ఖాళీ చేయాలని బెదిరించారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించటంతో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శెభాష్..షబానా

- కాలిగ్రఫీలో కర్నూలు విద్యార్థిని ఉత్తమ ప్రతిభ
- ఒకప్పటి డ్రాపవుట్ స్టూడెంట్
- నేడు మూడు భాషల్లో గోల్డ్‌మెడల్ కైవసం



కోడిగుడ్డుపై అందంగా రాస్తున్న షబానా





కాలిగ్రఫీలో గోల్డ్‌మెడల్ అందుకుంటున్న షబానా, (ఇన్‌సెట్‌లో) షబానా

కర్నూలు(హాస్పిటల్): మన చేతి రాతిను బట్టి మన వ్యక్తిత్వం తెలుస్తుందంటారు. అయితే, ఆ యువతి తలరాతను భగవంతుడు సరిగ్గా రాయకపోయినా కుంగిపోలేదు. తన తలరాతను తనే మార్చి రాసుకుంది. చదువులో ఉన్నతంగా రాణిస్తూ కాలిగ్రఫీలో ఏకంగా గోల్డ్‌మెడల్ సాధించింది కర్నూలు మండలం వెంకాయపల్లె గ్రామానికి చెందిన షేక్ షబానా (25). ఈ యువతి పాఠశాల విద్యను స్థానికంగా చదువుతూ ఏడో తరగతిలో డ్రాపవుట్ అయ్యింది. ఆ తర్వాత షబానాను తల్లిదండ్రులు బలవంతంగా బాల్య వివాహం చేశారు. పెళ్లి ఇష్టంలేని ఆ బాలిక కర్నూలులోని ఉమెన్ ఆర్మీ సంస్థను సంప్రదించింది. వారు దత్తత తీసుకుని 10వ తరగతి, ఇంటర్ దూరవిద్య ద్వారా చదివించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎన్‌సీపీయూఎల్‌లో చేర్పించారు. అక్కడ మాస్టర్ పాస్ మహమ్మద్ అబ్దుల్ గఫూర్ సూచనలు, సలహాలతో డిప్లమా ఇన్ అరబిక్, డిప్లమా ఇన్ ఉర్దూ, డిప్లమా ఇన్ కాలిగ్రఫి అభ్యసించింది. ఉర్దూ, అరబిక్, ఇంగ్లిష్ భాషలను కాలిగ్రఫిలో ఉత్తమ ప్రతిభ కనబరచింది. కేంద్ర ఉన్నత విద్య, ఉర్దూ బాష జాతీయ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని ఇదారె ఇ అరబియాత్ ఇ ఉర్దూ సెంటర్‌లో కాలిగ్రఫి, గ్రాఫిక్ డిజైన్ ట్రెనింగ్ సెంటర్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 6 నుంచి 24వ తేది వరకు 2022–24 బ్యాచ్ విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ప్రపంచ పురాతన కాలపు అక్షరాలు, ఇస్లామ్ పవిత్ర గ్రంథమైన దివ్య ఖురాన్‌ను లిఖించిన అక్షరాలు, అరబిక్, ఉర్దూ, ఇంగ్లిష్ భాషాలకు సంబంధించిన వివిధ ఫాంట్స్‌తో కాగితం, బియ్యం, గింజ, మేకచర్మం, కోడిగుడ్డు, బాదాం గింజలపై అద్భుత చిత్రాలను ఖురాన్‌లో చెప్పిన ప్రవచనాలను ప్రదర్శించారు. ఇందులో షేక్ షబానా సృజనాత్మక ప్రదర్శనకు దక్కన్ ఇనామ్ డైలీ లీడర్ అవార్డుతో పాటు గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 24వ తేదిన బంగారు పతకం, సర్టిఫికెట్‌ను అధికారులు ఆమెకు ప్రదానం చేసి సత్కరించారు. ఏపీలో కాలిగ్రఫిలో ఈ కోర్సులు పూర్తి చేసిన మొదటి యువతి షబానా కావడం విశేషం.